సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



పీడీఎస్ బియ్యం పట్టివేత

లారీలో అక్రమంగా తరలిస్తున్న 17.830 కేజీల పీడీఎస్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

-IIలో



చిరకాల వాంఛ సఫలీకృతం

జిల్లా ప్రజల చిరకాల వాంఛ సఫలీకృతమైందని, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం కానుందని జెడ్పీ చైర్మన్ తెలిపారు.

-IIలో

కొత్త బాధ్యతలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోట్ల వెంకటరావు స్థానంలో తాడ్డి వేణుగోపాలరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా రొంగలి కనకసింహాచలం, భైరెడ్డి ప్రభాకరరెడ్డి (నెల్లిమర్ల), పొట్నూరు సన్యాసిరావు (చీపురుపల్లి), కూనిరెడ్డి వెంకటరావు(ఎస్.కోట) నియామకమయ్యారు.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, పీడీ, గణితం, జువాలజీ, లైబ్రరీ సైన్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా అప్లై చేసుకోవాలన్నారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, వివరాలకు సెల్:8247792846 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హాకీ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల పోటీల్లో పాల్గొనేబోయే జిల్లా హాకీ జట్ల ఎంపిక పోటీలు గురువారం జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు విజయనగరం, పార్వతీపురంమన్యం జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపిక పోటీలను ఎంఈఓ రాజు ప్రారంభించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 11 మంది క్రీడాకారులను ప్రధాన జట్టులోకి ఎంపిక చేయగా... బాల, బాలికల జట్లలోకి మరో 7గురు క్రీడాకారులను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు పి.రమేష్, వై.సూర్యారావు తదితరులు పర్యవేక్షించారు.

వీడీవీకేల అభివృద్ధికి ప్రోత్సాహం

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏ ద్వారా నిర్వహించే వన్‌ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకే)ను అన్నివిధాల ప్రోత్సహిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి తెలిపారు. సీతంపేట వైటీసీలో వీడీవీకే శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వీడీవీకేలు దోహదపడతాయన్నారు. మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళల కు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆడలి వ్యూపాయింట్ వద్ద నైట్ క్యాంపింగ్ టెంట్స్, భోజన వసతి కల్పించేందుకు ఆసక్తిగల అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఒక సొసైటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు దత్తపుత్రుడని నిరూపించుకున్న పవన్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దత్తపుత్రుడని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిరూపించుకున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన ముద్దాయిగా అవినీతి ఆరోపణలపై అరెస్టైన చంద్రబాబునాయుడును రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో పవన్ కళ్యాణ్ కలిసిన నేపథ్యంలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య సాగుతున్న బంధాలబండారం బట్టబయలైందన్నారు. ప్యాకేజీ ఒప్పందం మేరకే పవన్ కళ్యాణ్ ప్రచారం తప్ప.. ఆయనకు స్పష్టమైన రాజకీయ జెండా, అజెండా ఏమీ లేదని విమర్శించారు. జనసేన నాయకులు, కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండాలని, లేదంటే టీడీపీకి అమ్మేసే అవకాశం ఉందన్నారు. నైతిక విలువలతో ఉండే జనసేన నాయకులు జాగురుకతతో మెలగాలని హితవుపలికారు.

ప్రజల సంక్షేమమే ముఖ్యం

- సెప్టెంబర్ 15 చరిత్రలో నిలిచిపోతుంది
- రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించనున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి
- మెరుగైన వైద్య సేవలందేలా వైద్యకళాశాలల ఏర్పాటు
- 17 వైద్యకళాశాలల ఏర్పాటు నిర్ణయం చరిత్రాత్మకమైనది..
- పవన్ కళ్యాణ్ ముసుగుతొలిగింది
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్ససత్యనారాయణ



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబైన ప్రభుత్వ వైద్యకళాశాల

విజయనగరం ఫోర్ట్:

ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వానికి ముఖ్యమని, అందులో భాగంగానే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త, టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయనగరంలోని గాజులరేగ వద్ద నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహాన్ని, శిలాఫలకాన్ని పరిశీలించారు. ఆ తర్వాత స్కిల్‌ల్యాబ్, బయోకెమిస్ట్రీల్యాబ్, లెక్చర్ హాల్స్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తొలిదశలో ఐదు ప్రభుత్వ కళాశాలలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలకు పండగ వంటిదని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వచ్చే ఏడాది మరో ఐదు వైద్య కళాశాలలను, ఆ మరుసటి ఏడాది మిగిలిన ఏడు వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. ఈ ఏడాది ఐదు కళాశాలల్లో ఇప్పటికే ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, తరగతులు కొనసాగుతున్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అందుబాటులోకి తెచ్చి పేదలకు ఆరోగ్యభరోసా కల్పించగా, ఆయన తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలను అందుబాటులోకి తెచ్చి వైద్యవిద్యతో పాటు మెరుగైన వైద్యసేవలను ప్రజలకు చేరువచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్ససత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, తదితరులు

పవన్‌కళ్యాణ్ ముసుగు తొలిగింది

ఇప్పటివరకు టీడీపీ, జనసేన పార్టీలు తెరవెనుక రాజకీయాలు చేసేవని, ఇప్పుడు జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ ముసుగు తొలిగించి తెరపైకి వచ్చారన్నారు. ఇందులో కొత్తవిషయం ఏదీ లేదన్నారు. అటువంటి నాయకుల గురించి మాట్లాడుకోవడం అనవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎం.డి.మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జేసీ మయూర్ అశోక్, ప్రిన్సిపాల్ పద్మలీల పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

పరవాడ: లంకెలపాలెం వంతెన సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సివిల్ ఇంజినీర్ గంటి శ్రీనివాసరావు(54) మృతి చెందాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ప్రాంతానికి చెందిన గంటి శ్రీనివాసరావు స్నేహితుడు రుత్తల మంగరాజుతో కలిసి లంకెలపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఇద్దరూ హైదరాబాద్‌లోని అనుకర్ ప్రాజెక్టులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఫార్మాసిటీ సమీపంలో కంపెనీ చేపట్టిన ఓ ప్రాజెక్టు పనులు చూస్తున్నారు. బుధవారం సాయంత్రం లంకెలపాలెంలో ఉంటున్న గదిలో దుస్తులు ఉతుక్కొని భోజనం అనంతరం నిద్రపోయారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో మంగరాజు బాత్ రూంకు వెళ్లగా.. దుస్తులు లేకుండా శ్రీనివాసరావు పడి ఉండడాన్ని గమనించి పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. తన భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, గుండె పోటుతో మరణించి ఉంటారని భావిస్తున్నామని పోలీసులకు మృతుడి భార్య శ్రీదేవి వివరించారు.

పైడితల్లిని దర్శించుకున్న సంగీత దర్శకుడు శ్రీచరణ్



పైడితల్లి సన్నిధిలో సంగీత దర్శకుడు శ్రీచరణ్

విజయనగరం టౌన్: తెలుగు సినీ సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకల గురువారం ఉదయం విజయనగరం పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే రింగురోడ్డులో ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. క్షణం, గూఢాచారి, జెస్సీ, చాణక్య, నాంది, మేజర్, తిమ్మరుసు, డీజే టిల్లు, ఉగ్రం, గరుడవేగ, తదితర బ్లాక్ బస్టర్ సినిమాలకు శ్రీచరణ్ సంగీత దర్శకత్వం వహించారు.

ఎరువుల ధరలకు కళ్లెం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ప్రైవేటు డీలర్ల ఎరువుల విక్రయాలపై నిఘా
- నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్:

ప్రైవేటు డీలర్లు ఎరువులు ధరలు పెంచకుండా కళ్లెం వేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగువిస్తీర్ణం, ఎరువుల వినియోగం పెరిగిందన్నారు. ఆలస్యంగా వరినాట్లు వేసిన ప్రాంతాల రైతుల కు ముందుగా యూరియా, ఇతర ఎరువులు అందే లా చర్యలు తీసుకోవాలన్నారు. మరో 10, 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున రైతులకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయశాఖ జేడీ తారకరామారావుకు సూచించారు. మండలాల వారీగా ఎక్కెడక్కడ ఎరువుల కొరత ఉందో గుర్తించి వెంటనే ఇండెంట్ పెట్టాలన్నారు. నానో యూరియాపై రైతులకు అవ గాహన కల్పించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై నీటిపారుదలశాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతానికి ఆంధ్ర మినహా మిగిలిన ప్రాజెక్టుల్లో సాగునీరు సమృద్ధిగా ఉందని, వరి సాగుకు నీటి సమస్య ఉండదన్నారు. ఈ ఏడా ది ధాన్యం సేకరణపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సివిల్ సప్లై మేనేజర్ మీనాను ప్రశ్నించారు. గత ఏడాది నిబంధనలతో పాటు ఈ ఏడాది కొత్తగా రైతుల బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది సేకరణకు సంబంధించి రూ.2.5 కోట్ల నిధులు విడుదలైనట్టు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసిన వారికి వెంటనే జీతాలు చెల్లించేలా సొసైటీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలని డీసీసీబీ సీఈఓ జనార్దనను కోరారు. ఏపీఎంఐపీ ద్వారా ఐదు ఎకరాల విస్తీర్ణం లోపు ఉన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు 90 శాతం రాయితీపైన, ఐదు ఎకరాలపైన ఉన్న వారికి 50 శాతం రాయితీపై సమకూర్చుతున్నట్టు పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కంబాల జోగులు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పాల్గొన్నారు.

104 జిల్లా మేనేజర్‌గా నజీర్ హుస్సేన్



విజయనగరం ఫోర్ట్: 104 అరబిందో ఎమర్జెన్సీ సర్వీసెస్ సంస్థ జిల్లా మేనేజర్‌గా నజీర్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జిల్లా మేనేజర్‌గా పనిచేసిన బి.వినోద్ కుమర్‌కు శ్రీకాకుళం బదిలీ అయింది. ఈ సందర్భంగా నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ 104 సేవలను ప్రజలకు మరింతగా చేరువచేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగులకు శతశాతం సేవలందేలా చూస్తానన్నారు.

ప్రతి బిల్లూ అప్‌లోడ్ చేయాల్సిందే

- డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: మనబడి నాడు-నేడు సెకెండ్‌ఫేజ్‌లో పూర్తిచేసిన పనుల బిల్లులను అప్‌లోడ్ చేయాలని డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. పార్వతీపురం పట్టణంలోని డీవీఎం పాఠశాలలో ఎంఈఓలతో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. వస్తువుల కొనుగోలు బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, పెద్ద, చిన్న మరమ్మతులు, విద్యుత్ మరమ్మతుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. పైకప్పు మరమ్మతులు, పెయింటింగ్, తాగునీటి సరఫరాకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలు అందించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశాలను ఎప్పటికప్పుడు నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో 15 మండలాల ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరి చెంతనే ప్రభుత్వ సేవలు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



బోరబందలో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, అధికారులు, స్థానిక నాయకులు

సాలూరు: గ్రామీణ ప్రజలు ఎలాంటి వ్యయప్రయాసలకు గురికాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరి చెంతనే అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలం బోరబందలో రూ.42 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ప్రజలు, రైతులకు కామధేనువు, కల్పవృక్షాలని పేర్కొన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని సిద్ధింపజేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పెదబోరబంద సచివాలయం పరిధిలో పెదబోరబంద, పురోహితునివలస పంచాయతీల్లోని ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల కింద నాలుగేళ్లలో సుమారు రూ.24.86 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. పెదబోరబందలో 3,807 మంది లబ్ధిదారులకు రూ.17.65కోట్లు, పురోహితునివలస పంచాయతీలోని 1609 మంది లబ్ధిదారులకు రూ.7.20కోట్లు సంక్షేమ పథకాల కింద అందించినట్టు వెల్లడించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వివిధ పనుల కోసం ఇప్పటివరకు రూ.కోటి 20లక్షలు మంజూరు కాగా, మరో రూ.2కోట్ల విలువైన పనులకు ప్రతిపాదించగా సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్లేపల్లి సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు త్రినాథ్, ఎంపీపీ జి.రాములమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఏఎంసీ వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనువాసరావు, సువ్వాడ రామకృష్ణ, పీడిక సుదర్శనదొర, సువ్వాడ భరత్‌శ్రీనివాస్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మరడాంలో పులి అలజడి

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామ సమీపంలోని మామిడి తోటలో కనిపించిన పులి పాదముద్రలు స్థానికుల్లో అలజడి రేపా యి. పాదముద్రలను గుర్తించిన రైతు వరుపుల వెంకటరమణ, సర్పంచ్ భర్త పోతల శంకరరా వు అటవీశాఖ అధికారులకు గురువారం సమాచారమిచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రవికుమార్, రాజబాబు, రిషికేష్‌లు పాదముద్రలను పరిశీలించి పులివిగా నిర్ధారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో సంచరించవద్దన్నారు.

పోటెత్తిన వంశధార




వంశధార తీరంలో నాటుపడవలను భద్రపరుస్తున్న మత్స్యకారులు

- ఒడిశా-ఆంధ్రా మధ్య నిలిచిన రాకపోకలు

భామిని: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షాలకు వంశధార నది నిండుగా ప్రవహిస్తోంది. నదిలో గురువారం 45 వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తున్నట్టు వంశధార ప్రాజెక్టు ఇంజినీర్లు స్పష్టం చేశారు. నదిలో వరదనీరు పెరగడంతో నాటుపడవపై ఆంధ్రా-ఒడిశా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బోట్లను మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు. కాట్రగడ-బి వద్ద వంశధార నదిపై ఏర్పాటు చేసిన ఓపెన్ హెడ్ చానల్‌కు వరదనీరు పోటెత్తింది. సుమారు 5వేల క్యూసెక్కుల వరదనీరు సైడ్ వియ్యర్ ద్వారా ప్రవహిస్తోంది.

నిండుగా నాగావళి



సంకిలి వద్ద నిండుగా నాగావళి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నాగావళి నదిలో నీటిప్రవాహం పెరిగింది. మడ్డువలస ప్రాజెక్టు నుంచి నీటిని విడిచిపెట్టడంతో గురువారం నది నిండుగా ప్రవహించింది. -రేగిడి

క్లుప్తంగా

ఓబీసీలో మరిన్ని కులాలు చేర్చాలి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మీడియాతో మీట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: ఓబీసీ జాబితాలో మరిన్ని కులాలను చేర్చాలని నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ (ఎన్‌సీబీసీ)కి సిఫారసు చేసినట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ కులాలు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని చేసిన విజ్ఞప్తులను పరిశీలించేందుకు బుధవారం ఢిల్లీలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా తూర్పుకాపు, శిష్టకరణ, కళింగ కోమిటి, కళింగ వైశ్య, సొండి, అరవ తదితర కులాలను ఓబీసీలో చేర్చాలని విజ్ఞప్తులు రాగా కమిషన్ పరిశీలించిందని చెప్పారు. రాష్ట్రంలో ఈకులాల వినతులను పరిశీలించి, ఓబీసీ జాబితాలో చేర్చాలని తాను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనికి కమిషన్ సానుకూలంగా స్పందించందని, ఓబీసీలో చేర్చడంవల్ల ఈకులాల వారికి కేంద్ర ప్రభుత్వ శాఖలలో డిఫెన్స్‌లో ఉద్యోగాలు పొందే అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

- 500 కిలోల రేషన్ బియ్యం సీజ్

భామిని: మండలంలోని తాటిమానుగూడకు చెందిన ఆరికి ప్రకాశ్, ఆరికి తాడులు వేర్వేరుగా సారా తరలిస్తుండగా గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు బత్తిలి ఎస్సై వై.అమ్మాన్ రావు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద ఇరవై లీటర్లు చొప్పున సారా సీజ్ చేసినట్లు వివరించారు. అలాగే బాలేరులో అక్రమంగా నిలువ ఉంచిన 500 కిలోల రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసి వీఆర్‌ఓ సంజీవరావు ఆద్వర్యంలో రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

నాగయ్య జాతీయ పురస్కారానికి తిరుపతిరావు ఎంపిక



రాజాం సిటీ: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు ఎం.చిననాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి రాజాం రచయితల వేదిక సభ్యుడు పిల్లా తిరుపతిరావు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం చిననాగయ్య మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి ఎం.రాంప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించినట్లు తిరుపతిరావు తెలిపారు. వ్యాసం, కథ, కవిత్వం, జీవిత చరిత్ర విభాగాల్లో తాను రచించిన ఆజిరి సాహిత్య వ్యాస సంపుటి ద్వారా తనకు ఈ అవకాశం లభించిందని పేర్కొన్నారు. అక్టోబర్‌లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో పురస్కారం ప్రదానం చేయనున్నారన్నారు. ఆయన ఎంపిక పట్ల రాజాం రచయితల వేదిక సభ్యులు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, డాక్టర్ ఆల్తి మోహనరావు, పొదిలాపు శ్రీనివాసరావు, పెంకి దయానిధినాయుడు తదితరులు సంతోషం వెలిబుచ్చారు.

టీచర్ మెడలో బంగారం చోరీ

జామి: మండలంలోని గొడికొమ్ము ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జి.శ్రీదేవి జేడీ వలస గ్రామం నుంచి పాఠశాలకు రాకపోకలు సాగిస్తారు. ఎప్పటిమాదిరిగా గురువారం ఆమె పాఠశాల విడిచిపెట్టిన అనంతరం నడుచుకుంటూ తన స్వగ్రామం జేడీ వలస వెళ్తున్న సమయంలో బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వెనుకనుంచి వచ్చి ఆమె మెడలో బంగారం చైన్, నల్లపూసలు తెంచి పరారయ్యారు. బంగారం చైన్, నల్లపూసలు సగం మేర దుండగులు పట్టుకుని పోగా, మిగతా సగం ఆమె చేతిలో ఉండిపోయాయి. సుమారు తులంన్నర బంగారం చోరీ అయినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం మండలకేంద్రం జామిలో పండ్ల దుకాణం నడుతున్న మహిళ మెడలోని బంగారం గొలుసును బైక్‌పై వచ్చి చోరీ చేశారు. దీంతో మండలంలోని మహిళలు భయాందోళనకు గురవుతున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

ప్రజారోగ్యమే పరమావధి..!

- జగనన్న ఆరోగ్య సురక్ష నేడు ప్రారంభం
- రేపటి నుంచి ఇంటింటి సర్వే
- 30 నుంచి ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు
- ప్రజలకు చేరువగా స్పెషలిస్టు వైద్యసేవలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, ఎవరూ ఏ చిన్న అనారోగ్యంతోనూ అవస్థలు పడకూడదని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ప్రభుత్వం ఇప్పటికే వైద్యారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులతో వైద్యాన్ని ప్రజలకు చేరువచేసింది. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో స్పెషలిస్టు సేవలనూ గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమవుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహణకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. తొలిరోజు స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వినియోగించుకోవాలని సూచిస్తారు. శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుంది. ప్రతి సచివాలయం పరిధిలో రెండు బృందాలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహిస్తాయి.

ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా..

ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎం, సీహెచ్‌వో, ఆశ, వలంటీర్‌లు ముగ్గురు చొప్పున బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వేలో భాగంగా ప్రజల ఆరోగ్య స్థితిగతులను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేస్తారు. అక్కడే బీపీ, షుగర్, యూరి, హిమోగ్లోబిన్, కళ్లె, డెంగీ, మలేరియా జ్వరాలు, చర్మంపై దీర్ఘకాలిక మచ్చలు తదితర ఏడు రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తారు. ఆ వివరాలనూ యాప్‌లో నమోదు చేసి వారికో హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తారు. దీని ఆధారంగా వైద్యం అవసరమైన వారి కేస్ షీట్ తయారవుతుంది. వారికి టోకెన్ నంబరు కూడా ఇస్తారు. దీని ఆధారంగానే ఆ తరువాత దశలో వైద్యం అందిస్తారు.

ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన..

ఇంటింటి సర్వే సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 1050 వ్యాధులు మాత్రమే ఆరోగ్యశ్రీ కవరేజీలో ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా 3120 రకాల వ్యాధులకు విస్తరించింది. ఈ వ్యాధుల గురించి, వాటికి వైద్యం చేయించుకునే విధానం, శస్త్రచికిత్సలు, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు, అక్కడ అందే సేవల గురించి సర్వేలో వివరిస్తారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.

30 నుంచి వైద్య శిబిరాలు..

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వెల్‌నెస్ సెంటర్, పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో ఒక్కొక్క శిబిరం చొప్పున ఉంటాయి. ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లతోపాటు మరో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు శిబిరానికి వస్తారు. స్పెషలిస్టు డాక్టర్లలో తప్పనిసరిగా ఒక గైనకాలజిస్టు లేదా చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. యాప్ ఆధారంగా రూపొందించిన కేస్ షీట్, వారి టోకెన్ నంబర్‌ను బట్టి సంబంధిత స్పెషలిస్టు డాక్టర్ల దగ్గరకు ఆయా పీహెచ్‌సీల వైద్యులు రిఫర్ చేస్తారు. అవసరమైన మందులను, పౌష్టికాహారం, కళ్లద్దాలను అందిస్తారు.

సమన్వయంతో సమర్థంగా నిర్వహణ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పరస్పర సమన్వయంతో సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ఈ మేరకుగురువారం ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, బడికి వెళ్లే విద్యార్థుల ఆరోగ్య వివరాలను కూడా సేకరించాలని చెప్పారు. రక్తహీనతతో బాధపడుతున్నవారు, సుగర్, బీపీ లాంటి జీవన శైలి వ్యాధిగ్రస్తుల వివరాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆ వివరాలను సర్వే బృందాలకు ముందుగానే అందజేయాలని అధికారులను ఆదేశించారు.

17,830 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

బొండపల్లి: లారీలో అక్రమంగా తరలిస్తున్న 17830 కేజీల పీడీఎస్ బియ్యం మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు సమీపంలో పట్టుకుని సీజ్ చేసి గజపతినగరంలోని ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహచలం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.ఎల్.కోట లోని నర్సింహ ట్రేడర్స్‌కు చెందిన యజమాని గ్రామాల్లోని పీడీఎస్ బియ్యం సేకరించి నిల్వ చేసి ఒడిశాలోని కొరాపుట్‌కు కొంతకాలంగా తరలిస్తున్నాడు. ఈ మేరకు అందిన సమాచారంతో గురువారం గొట్లాంలోని బైపాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించగా లారీలో 358 ప్లాస్టిక్ గోనె సంచుల్లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తదుపరి చర్యల నిమిత్తం బియ్యాన్ని గజపతినగరం సివిల్ సప్లయ్‌స్ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు అప్పగించి సంబంధిత నర్సింహ ట్రేడర్స్ యజమానిపై 6ఎ కేసు నమోదు చేశారు. పట్టుకున్న లారీని బొండపల్లి పోలీసులకు అప్పగించినట్లు విజిలెన్స్ అధకారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ కానిస్టేబుల్ పురుషోత్తం, పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొండపల్లి: పొరపాటున కోళ్లకు ఉపయోగించే మందు తాగిన మండలంలోని ఒంపల్లి గ్రామానికి చెందిన లండా అప్పలనాయుడు(47) చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాచకిండాం గ్రామానికి సమీపంలో గల కోళ్లఫారం వద్ద మంచినీటి బాటిల్ అనుకుని కోళ్లకు ఉపయోగించే మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య అప్పయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు బొండపల్లి ఏఎస్సై శ్రీనివాస రావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-దేవరాపల్లి రోడ్డులో ముసిరాం సమీపంలో కల్వర్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (50) లభ్యమైంది. ఈ మృతదేహాన్ని స్థానికులు గురువారం గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఎస్సై వీరజనార్దన్ సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించి ఆరా తీశారు. ఎవరూ వివరాలు చెప్పలేకపోయారు. ఆ వ్యక్తి మూడు రోజుల క్రితం మరణించి ఉంటాడని ఎస్సై వీరజనార్దన్ అంచనా వేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-పెందుర్తి రోడ్డులో పాత రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వృద్ధులను ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. కొత్తవలస గ్రామానికి చెందిన విశ్వేస్వశ్వరరావు, భారతి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోయి గాయాలపాలయ్యారు. ప్రమాద స్థలం నుంచి ఆటోడ్రైవర్ పరారయేందుకు ప్రయత్నించగా స్థానిక యువకులు వెంబడించి పట్టుకున్నారు. ఆటోడ్రైవర్‌ను గొల్లపేట గ్రామానికి చెందిన అప్పలనాయుడుగా గుర్తించి పోలీసులకు అప్పగించారు. గాయపడిన వృద్ధులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

చిరకాల వాంఛ సఫలీకృతం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు

విజయనగరం ఫోర్ట్:

జిల్లా ప్రజల చిరకాల వాంఛ సఫలీకృతమైందని, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం కానుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాణాలు కాపాడుకోవడానికి ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు ఇబ్బంది పడేవారని, ప్రతిపక్ష నేతగా పాదయాత్ర నిర్వహించిన సమయంలో జిల్లా ప్రజల కష్టాలను తెలుసుకున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజల కష్టాలను తీర్చడానికి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించనున్నారన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఈఏడాది ఐదు కళాశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్నారని తెలిపారు. విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలను స్వయంగాను, మిగతా నాలుగు వైద్య కళాశాలలను వర్చువల్ విధానంలో ఇక్కడి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లాకు 150 మెడికల్ సీట్లు అందుబాటులో ఉండగా 120 వరకు అడ్మిషన్లు పూర్తయినట్లు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారని, జిల్లాకు వస్తున్న ఆయనకు ప్రజలంతా కృతజ్ఞతలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాలజోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు అవనాపు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పర్యాటకంపై వీడియో పోటీలు

- 3 నిమిషాల్లో పాత/కొత్త ప్రాంతాలను పరిచయం చేయాలి
- ఏపీటీఏ, ఏపీటీడీసీ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ
- వీడియో అప్‌లోడ్‌కు ఈ నెల 25వ తేదీ ఆఖరు

సాక్షి, విశాఖపట్నం:

ప్రకృతి సోయగాలు.. మైమరిపించే అందాలు.. పరవళ్ల తొక్కే నదులు, జాలువారే జలపాతాలు.. చారిత్రక ప్రదేశాలు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాలో ఎన్నో ప్రకృతి రమణీయ ప్రదేశాలు, చారిత్రక ప్రాంతాలున్నాయి. ఈ పర్యాటక ప్రాంతాలను మరింత అందంగా చూపించే టాలెంట్ మీ సొంతమైతే.. అద్భుత అవకాశాన్ని కల్పిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. సందర్శనీయ ప్రాంతాలను అద్భుతమైన రీతిలో వీడియోలో బంధించి.. పర్యాటక శాఖ అందజేసే బహుమతి కొట్టేయొచ్చు. ఇప్పటివరకు ఎవరూ చూడని ప్రాంతాలను చూపిస్తే.. విజయావకాశాలు ఎక్కువగా ఉండే చాన్స్ ఉంది. మరెందుకు ఆలస్యం.. వెంటనే మీలోని సృజనాత్మకతకు పదునుపెట్టండి.!

ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఏపీ టూరిజం అథారిటీ(ఏపీటీఏ), ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) సంయుక్తంగా వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో పోటీలు జరగనున్నాయి. ఓ పర్యాటక ప్రాంత విశేషాలు, గొప్పదనాన్ని దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా, అబ్బురపరిచేలా 3 నిమిషాల వ్యవధిలో వీడియోను చిత్రీకరించి పోటీలకు పంపాలి. ఓ ప్రాంతానికి సంబంధించిన ఓ వీడియో లేదా వివిధ ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు పంపేందుకు అవకాశం ఉంది. తెలుగు లేదా ఇంగ్లిష్ భాషలో వాయిస్ ఓవర్లు తప్పనిసరి.

మొదటి బహుమతి రూ.10వేలు

పర్యాటక శాఖ నిర్వహిస్తున్న వీడియో పోటీల్లో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందజేస్తాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కొత్త పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. ఏపీ టూరిజం వెబ్‌సైట్ https://aptourism.ap.gov.in/apworldtourismday/#/ Register లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వీడియోను అప్‌లోడ్ చేయాలి. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పర్యాటక ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్ పాణి,
పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

ఫోర్ట్ సిటీ స్కూల్,
100 ఫీట్ రింగ్ రోడ్, విజయనగరం
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9951602843, 9705346345

ఆరోగ్య సురక్ష శిబిరాలకు గర్భిణులు రావాలి

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జి.జయలక్ష్మి



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 30 వతేదీ నుంచి నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు గర్భిణులు, బాలింతలు వచ్చేలా చూడాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి. జయలక్ష్మి, కమిషనర్ ఎం.జానకి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం వారు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బరువు,ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలు, పౌష్టికాహార లోపం, రక్తహీనత కలిగిన పిల్లలను తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా వివిధ రకాల వ్యాధులతో బాధపడే పిల్లలను కూడా తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వద్ద పరీక్షలు నిర్వహిస్తారని, ఈ మేరకు రక్తహీనత ఎవరికి ఉన్నా తెలుస్తుందని చెప్పారు. టేక్ హోం‌రేషన్ పంపిణీకి సంబంధించి పూర్తి స్థాయిలో సరుకులు ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిణి బి. శాంతకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఎస్టీల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



అభినందనలు స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: కాకినాడలోని ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ జిల్లా ఎరుకుల సంఘం జిల్లా కమిటీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేసింది. తొలుత ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం సమస్యలను పిటిషన్ రూపంలో అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం కమిషన్ సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి న్యాయం చేస్తుందని చైర్మన్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు రాంబాబు, విజిలెన్స్ కమిటీ సభ్యులు భద్రం తదితరులు ఉన్నారు.

ఉపాధి కోర్సులకు స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఉపాధి, ఉద్యోగావకాశాలున్న వివిధ కోర్సులకు స్కిల్ హబ్స్ ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తామని ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు తెలిపారు. రెండు నెలల కాలవ్యవధి ఉన్న అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు ఇంటర్‌మీడియట్/డిగ్రీ విద్యార్హత ఉండాలని, మూడు నెలల కాలవ్యవధి ఉన్న అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు 8వ తరగతి/ఐటీఐ ఫిట్టర్ విద్యార్హత ఉండాలని ఈ కోర్సులో చేరే అభ్యర్థులకు స్థానిక కేంద్రియ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అదేవిధంగా రెండునెల కాలవ్యవధి కోర్సులలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదోతరగతి/ఐటీఐ విద్యార్హత, హెల్పర్ మేషన్ కోర్సుకు 5వ తరగతి ఆపై విద్యార్హత ఉంటే సరిపోతుందని వాటికి శిక్షణ స్థానిక బీసీ కాలనీలోని న్యాక్ (ఎన్ఏసీ) శిక్షణాకేంద్రంలోని స్కిల్ హబ్‌లో ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఫోన్ 9652515251, 7075342406, 9866564273 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గోడకూలి మహిళకు గాయాలు

సీతంపేట: మండలంలోని కోడిశ కొత్తగూడ గ్రామానికి చెందిన సవర తిక్కమ్మ గోడకూలిన సంఘటనలో తీవ్ర గాయాలపాలైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గోడనానిపోయి కూలింది. తీవ్రగాయాలైన ఆమెను శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అత్యవసర వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

మనవడి మరణంతో ఆగిన తాత గుండె



రమణ మృతదేహం

సాలూరు: మనవడి మరణవార్తతో తాత గుండుపోటుతో మరణించిన విషాదకర ఘటన సాలూరు పట్టణంలోని అక్కేన వీధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కేనవీధికి చెందిన గనివాడ శంకరరావు (37) పాలవ్యాపారం చేస్తుంటాడు. రోజూ బొబ్బిలి వెళ్లి పాలు సేకరించి సాలూరుకు వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బొబ్బిలి ఫ్లైఓవర్ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో మరణించాడు. విషయం గురువారం వేకువజామున శంకరరావు తాత అయిన రమణ(75)కు కుటుంబీకులు తెలుపగా... గుండెపోటుకు గురై మృతిచెందాడు. తాత, మనవడు ఒకేసారి మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అక్కేన వీధిలో విషాదం అలముకుంది.

గాయపడిన యువకుడు మృతి

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం రాత్రి బైక్‌తో వెళ్తున్న ముగ్గురు యువకులు నడిచి వస్తున్న సాలూరుకు చెందిన శంకరరావును ఢీకొట్టారు. ప్రమాదంతో శంకరరావు మృతిచెందగా, గాయపడిన బొబ్బిలి పట్టణంలోని దావాల వీధికి చెందిన రాయి జోసెఫ్ (17) అనే యువకుడు కూడా మృతి చెందాడు. ఇతని తండ్రి రాయి శ్రీనివాసరావు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పదో తరగతి చదివి ఉపాధి కోసం పనిచేస్తున్న జోసెఫ్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.



గనివాడ శంకరరావు (ఫైల్)



జోసెఫ్ (ఫైల్)